క్లుప్తంగా

మారెమ్మ ఆలయ జీర్ణోద్ధరణ పూజలు



వాడపాలెంలో ఆలయ జీర్ణోద్ధరణ పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: మండలంలోని వాడపాలెం గ్రామదేవత మారెమ్మ ఆలయ జీర్ణోద్ధరణ పూజలు జరిగాయి. అమ్మవారి ఆలయాన్ని పునర్నిర్మించాలన్న ఆలయ కమిటీ నిర్ణయం మేరకు గ్రామస్తులు ఆదివారం జీర్ణోద్ధరణ పూజలు చేసి పనులు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ,ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించగా ఆలయ ఆసాదులు ఆశీర్వచనాలు అందజేశారు. పార్టీ నాయకుడు బండారు కృష్ణమూర్తి, పెదపూడి శ్రీనివాస్, మట్టా బాబ్జి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

మామిడికుదురు: ఆదుర్రులో సర్పంచ్ బళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. మామిడికుదురుకు చెందిన అంజు కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 150 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. చత్వారం, తలనొప్పి, కంటి మసకలు తదితర సమస్యలు ఉన్న వారికి కంప్యూటర్ ద్వారా పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు అందించారు.

వివాహానికి ఆర్థిక సాయం



శృంగవరప్పాడులో వెంకటేశ్వరరావుకు ఆర్థిక సాయం చేస్తున్న శివకుమార్

సఖినేటిపల్లి: మండలంలోని శృంగవరప్పాడులో ఆదివారం పేద కుటుంబానికి చెందిన కుడిపూడి వెంకటేశ్వరరావు కుమార్తె వివాహానికి శ్రీనేస్తం సేవా సమితి ద్వారా రూ.40 వేలు ఆర్థిక సాయం పంపిణీ చేశారు. ఈ మొత్తాన్ని నెడ్ క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్ చేతుల మీదుగా వెంకటేశ్వరరావుకు అందజేశారు. గ్రామస్తులు రావి త్రిమూర్తులు, చెల్లుబోయిన రాంబాబు, పాటి రామకృష్ణ, సంస్థ సభ్యులు దొంగ స్వామి, బొక్కా బాలకృష్ణ, చెల్లుబోయిన రామకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

కొబ్బరి చెట్టు పడి విద్యుత్ వైర్లు ధ్వంసం

అంబాజీపేట: ముక్కామల సబ్‌స్టేషన్ ఎదురుగా ప్రధాన పంట కాలువ పక్కనే ఉన్న ఓ కొబ్బరి చెట్టు ఆదివారం అర్ధరాత్రి సమయంలో విరిగి విద్యుత్ వైర్లపై పడింది. దాంతో విద్యుత్ వైర్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అర్ధరాత్రి నుంచి ముక్కామల, ఇరుసుమండ, వక్కలంక, పసుపల్లి, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం గ్రామాల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వారి సిబ్బంది, పొక్లెయిన్ సాయంతో ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

ఆలమూరు ఎస్సైగా శ్రీనివాస నాయక్



ఆలమూరు: స్థానిక పోలీసుస్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎల్.శ్రీనివాస నాయక్ నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా స్థానిక ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సోమన శివ ప్రసాద్ ముమ్మిడివరం ఎస్సైగా వెళ్లారు. ప్రస్తుతం అల్లవరం ఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎల్.శ్రీనివాస నాయక్ ఆలమూరు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదివారం వెల్లడించారు.

రెవెన్యూ కార్యాలయంలో జేఏగా పవన్‌కుమార్



నియామక పత్రాన్ని అందుకుంటున్న పవన్‌కుమార్

ఆత్రేయపురం: మండలంలోని వాడపల్లికి చెందిన మీసాల పవన్‌కుమార్ గ్రూప్–4లో ఉత్తీర్ణత సాధించి రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందాడు. ఆ మేరకు కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ద్వారా నియామక పత్రాలు అందుకున్నారు. పవన్‌కుమార్ తండ్రి మీసాల రాధాకృష్ణ పొగడట్లపల్లి ఉప్పలపాటి జానకమ్మ సత్రం ఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

అధ్వానంగా అవుట్ ఫాల్ స్లూయిజ్‌లు

- మొరాయిస్తున్న షట్టర్లు
- రైతులకు తప్పని ఇబ్బందులు



అధ్వానంగా ఉన్న కదలి అవుట్ ఫాల్ స్లూయిజ్

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీతీరంలో అధ్వానంగా మారిన అవుట్ ఫాల్ స్లూయిజ్‌లు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వాడబోది, వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్లపై నిర్మించిన స్లూయిజ్‌లతో పాటు కదలి మీడియం డ్రైన్‌పై నిర్మించిన స్లూయిజ్‌కు కాలం చెల్లిపోయింది. మూడు అవుట్ ఫాల్ స్లూయిజ్‌లు పాడై పోవడంతో రైతులు ఏటా ముంపు సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని వైనతేయ గోదావరి నదీ తీరంలో మూడు మీడియం డ్రైన్లు ఉన్నాయి. వాడబోది, వాడ్రేవుపల్లి, కదలి మీడియం డ్రైన్లు ఉన్నాయి. ఈ డ్రైన్ల ద్వారా గోదావరి పోటు సమయంలో ముంపునీరు నదిలోకి దిగుతుంది. పోటు సమయంలో నదిలో నుంచి నీరు డ్రైన్‌లోకి రాకుండా షట్టర్లు మూసేస్తారు. ఈ పనులను నియంత్రించేందుకు అవుట్ ఫాల్ స్లూయిజ్‌లు ఉపయోగపడతాయి. నదీతీరంలో ఉన్న మూడు స్లూయిజ్‌ల పరిస్థితి అధ్వానంగా ఉండడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ స్లూయిజ్‌ల షట్టర్లతో పాటు వీటి శ్లాబ్ కూడా పాడైపోయింది. అనుక్షణం షట్టర్లు మొరాయిస్తూ రైతులకు కడగండ్లను మిగులుస్తున్నాయి.

20 వేల ఎకరాలకు ఆయకట్టు

వాడబోది, వాడ్రేవుపల్లి, కదలి మీడియం డ్రైన్ల నుంచి 20 వేలకు పైబడిన ఆయకట్టుకు చెందిన ముంపు నీరు గోదావరి నదిలోకి దిగాల్సి ఉంది. ఆదుర్రులోని వాడబోది మీడియం డ్రైన్ ద్వారా 8,050 ఎకరాలు, అదే గ్రామంలోని వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్ ద్వారా 5,200 ఎకరాలు, మగటపల్లి–గోగన్నమఠం గ్రామాల సరిహద్దులోని కదలి మీడియం డ్రైన్ ద్వారా 7,050 ఎకరాల ఆయకట్టుకు చెందిన ముంపునీరు దిగాల్సి ఉంది. అవుట్ ఫాల్ స్లూయిజ్‌లకు కాలం చెల్లడంతో పాటు షట్టర్లు సక్రమంగా పని చేయకపోవడం రైతులను కలవర పెడుతున్నాయి.

రైతులకు ఏటా ముంపు పాట్లే

మూడు స్లూయిజ్‌ల పరిస్థితి అధ్వానంగా ఉండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ స్లూయిజ్‌ల షట్టర్లు పూర్తిగా మొరాయిస్తున్నాయి. దీంతో పాశర్లపూడి, పాశర్లపూడిలంక, లూటుకుర్రు, ఆదుర్రు, మాకనపాలెం, కొమరాడ, ఈదరాడ, మగటపల్లి గ్రామాల్లోని వందలాది ఎకరాల్లో పంట ఏటా ముంపునకు గురవుతోంది. దీనిపై రైతుల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతుంది. స్లూయిజ్‌ల పరిస్థితిపై హెడ్ వర్క్స్ ఏఈఈ టీవీఎల్ఎన్ మూర్తిని వివరణ కోరగా వైనతేయ, వశిష్ట తీరాల్లోని నాలుగు అవుట్ ఫాల్ స్లూయిజ్‌ల పునర్నిర్మాణానికి రూ.12.36 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి పంపించామన్నారు.

ఆనందరావును సత్కరించిన ఆర్‌జేడీ



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కత్తుల ఆనందరావును సత్కరిస్తున్న ఆర్జేడీ నాగమణి

పి.గన్నవరం: సూరంపాలెంలో జరుగుతున్న స్కూల్ లీడర్‌షిప్ శిక్షణలో ప్రతిభ కనబరచిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పోతవరం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కత్తుల ఆనందరావును రీజినల్ జాయింట్ డైరెక్టర్, కోర్సు డైరెక్టర్ నాగమణి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. 37 సంవత్సరాలుగా విద్యాభివృద్ధికి ఆనందరావు చేస్తున్న కృషిని ఆమె అభినందించారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ఉత్తమ సేవలు అందించాలని, శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు సూచించారు. ఈసందర్భంగా అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం ప్రదర్శించి ఆనందరావు అందరినీ అలరించారు.

పలువురికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న జంపన బుజ్జిరాజు, బోనం రాజు

మలికిపురం: మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు సమకూర్చిన ఆర్థిక సహాయం ఆదివారం అందించారు. చిట్టాల నరసింహారావు(కత్తిమండ)కు రూ.5 వేలు, కాంపాటి సత్యనారాయణ(విశ్వేశ్వరాయపురం)కు రూ.10 వేలు, యాతం ఏసు(కత్తిమండ)కు రూ.10 వేలు, కంచి తుంబురుడు (మలికిపురం)కి రూ.10 వేలు ఆర్థికసాయంగా అందించారు. స్థానిక వసుధ ఫౌండేషన్ ప్రతినిధులు జంపన బుజ్జిరాజు, బోనం రాజు చేతుల మీదుగా సాయం అందించారు. వీరి అనారోగ్య పరిస్థితులను చైర్మన్ వెంకటరామరాజు దృష్టికి తీసుకు వెళ్లిన వెంటనే ఆయన మానవతా హృదయంతో స్పందించి ఈ ఆర్థిక సాయాలను అందించినట్లు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో మలికిపురం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తోరం సతీష్, అల్లూరి మధురాజు, అటారం మాస్టారు, ఆరేటి రామచంద్ర, తోలేటి వీరరాఘవులు, చిట్టాల శివాజీ పాల్గొన్నారు.

300 మందికి వైద్య సేవలు



మొగలికుదురులో పరీక్షలు చేస్తున్న ప్రవీణ్‌కుమార్

మామిడికుదురు: జగ్గన్నపేట శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఉచిత వ్యాస్కులర్, చర్మ వ్యాధుల వైద్య శిబిరం శనివారం మొగలికుదురులోని జగ్గన్నపేట సత్యసాయి కల్యాణం మండపం వద్ద జరిగింది. హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ వ్యాస్కులర్ హాస్పిటల్ సౌజన్యంతో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్లు ప్రవీణ్‌కుమార్, శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో 300 మందికి ఉచితంగా వైద్య సేవలందించారు. పలువురికి రూ.4,500 విలువ కలిగిన కలర్ డాప్లర్ అల్ట్రాసౌండ్ ద్వారా ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. శ్రీసత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు అడబాల కొండబాబు, సేవా సంస్థల కన్వీనర్ డాక్టర్ కాశిన ప్రభాకర్, ఎస్.వర్ధనరావు, ఎం.నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కేశ ఖండన కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న కేశ ఖండన కార్మికులు

మామిడికుదురు: ప్రభుత్వ జీవో 110కి అనుగుణంగా వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దేవస్థానం కేశ ఖండన శాల కార్మికులు చేపట్టిన ఆందోళన ఆదివారం రెండోరోజుకు చేరుకుంది. పాత గుడి వద్ద ఉన్న కేశఖండన శాల వద్ద కార్మికులు బైఠాయించారు. కుటుంబ సభ్యులతో కలసి ధర్నా చేశారు. కేశ ఖండన శాఖలో పనిచేస్తున్న 37 మంది కార్మికులకు నెలకు రూ.20 వేలు వేతం చెల్లించాలని, నాలుగు నెలల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేశఖండన శాల కార్మికులు కత్తిని డౌన్ చేసి విధులను బహిష్కరించడంతో స్వామికి తలనీలాలు సమర్పించేందుకు వచ్చిన భక్తులు రెండో రోజు కూడా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్, భానుప్రకాష్, ఆలయ ఉద్యోగులు కార్మికులతో వారి డిమాండ్లపై చర్చించారు. కార్మికులకు ముందు కొన్ని ప్రతిపాదనలు చేయగా వాటికి తిరస్కరించారు. దీంతో కార్మికుల ఆందోళన నిరవధికంగా కొనసాగుతుంది. నిరసనలో సంఘం అధ్యక్షుడు రామేశ్వరపు నాగవీవీ సత్యప్రసాద్, కార్యదర్శి పసలపూడి వీవీ దుర్గారావు, గౌరవాధ్యక్షుడు కాజులూరి సత్యనారాయణమూర్తి, కోశాధికారి రామేశ్వరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. నగరం ఎస్సై పి.సురేష్ కార్మికులతో మాట్లాడారు. భక్తులకు ఏ విధమైన ఇబ్బంది కలగకుండా చూడాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దన్నారు. కాగా ఆందోళన చేస్తున్న కార్మికులకు గ్రామ శెట్టిబలిజ సంఘం సంఘీభావం తెలిపింది. కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేసింది. జీఓ 110 అమలు చేయాలని కోరుతూ ఆలయ ఉద్యోగులకు సంఘం వినతిపత్రం ఇచ్చింది.

మహిళలకు ఉచిత శిక్షణ

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలిలో స్థానిక మ్యాజిక్ హౌస్ వద్ద అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు బ్యూటీ పార్లర్, కుట్టు మెషీన్, శారీ పెయింటింగ్, కంప్యూటర్ శిక్షణ వంటి ఉచిత తరగతులు నిర్వహించారు. స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనర్ దొమ్మేటి శారద లక్ష్మీ కుమారి శిబిరాన్నిప్రారంభించి మహిళలకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చారు. అనూస్ సంస్థ అధ్యక్షురాలు అన్నపూర్ణ మాట్లాడుతూ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో శ్యామ్ మ్యాజిక్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టీడీపీ నేత లోకేష్‌పై ఫిర్యాదు

మామిడికుదురు: యువగళం పాదయాత్ర వేదికగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నేతలు ఆదివారం నగరం ఎస్సై పి.సురేష్‌కు ఫిర్యాదు చేశారు. టీడీపీ శ్రేణులను రెచ్చగొడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా కుట్ర చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసులుంటేనే పదవులని అల్లర్లకు టీడీపీ ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. లోకేష్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గ సోషల్ మీడియా కో–కన్వీనర్లు కీర్తి రైనా, చిలకపాటి రాకేష్, మండల కన్వీనర్ ఉండ్రు వినోద్, కో–కన్వీనర్లు మురళి, కిరణ్, రాజు, వంశీ, జగదీష్ ఫిర్యాదును నగరం పోలీస్ స్టేషన్‌లో అందజేశారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న టీడీపీకి చెందిన చంద్రబాబు నాయుడు, లోకేష్, అచ్చెంనాయుడులపై చర్యలు తీసుకోవాలని ఎస్సై రాముకు, కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ కన్వీనర్ పాటి శివకుమార్ ఆదివారం ఫిర్యాదు చేశారు. జిల్లా కన్వీనర్ మహేష్, మండల కో కన్వీనర్ కిషోర్ పాల్గొన్నారు.

పి.గన్నవరం: రెచ్చగొట్టే ప్రసంగాలతో రాష్ట్రంలో అల్లర్లు సృష్టిస్తున్న టీడీపీ నేతలు నారా లోకేష్‌తో పాటు, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ కుడుపూడి రామశంకర్ (రాము), కోకన్వీనర్ పెనుమాల శివనగేష్ ఆదివారం రాత్రి పి.గన్నవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. 2019 నుంచి 2024 వరకూ ఎవరి మీద ఎక్కువ కేసులు నమోదయితే వారికి నామినేటెడ్ పదవులు ఇస్తామని అల్లర్లు ప్రేరేపించే విధంగా టీడీపీ నేత లోకేష్ మాట్లాడుతున్నారని వారు వివరించారు. రాష్ట్రంలో అశాంతి, అరాచకాలు సృష్టిస్తున్న టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పొన్నాడను కలసిన ఎమ్మెల్యే రాపాక



పొన్నాడను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: టీటీడీ పాలకవర్గ సభ్యుడిగా నియమింపబడిన ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌ను రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మర్యాదపూర్వకంగా కలిశారు. పొన్నాడకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. మాజీ ఎంపీపీ ముత్యాల కాశి, రొక్కాల వెంకట్, కొల్లాబత్తుల అశోక్‌కుమార్ తదితరులు పొన్నాడను కలసిన వారిలో ఉన్నారు.

రాజోలు: టీటీడీ పాలకవర్గ సభ్యుడిగా నియమితులైన ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌ను ఆదివారం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి మహాగజమాల ఫౌండేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పార్టీ అధ్యక్షుడిగా సేవలందిస్తూ సీఎం జగన్ మన్ననలు పొందుతూ టీటీడీ సభ్యుడిగా నియమితులు కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. మర్యాదపూర్వకంగా టీటీడీ సభ్యుడు సతీష్‌కుమార్‌ను కలసి అభినందనలు తెలిపారు. నాయకులు చింతా మహానాగరాజు, యిల్లింగి వెంకటరమణ, కర్రి వెంకటరామరాజు, పెమ్మాడి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా శ్మశానవాటిక షెడ్డు



పాశర్లపూడిలంకలో నిరుపయోగంగా ఉన్న శ్మశానవాటిక షెడ్డు

మామిడికుదురు: పాశర్లపూడిలంకలో వైనతేయ గోదావరి నదీతీరంలో నిర్మించిన శ్మశానవాటిక షెడ్డు నిరుపయోగంగా మారింది. షెడ్డు నిర్మించినప్పటికీ అందులో బెడ్ ఏర్పాటు చేయకపోవడంతో అది కాస్తా అసంపూర్తిగా మిగిలిపోయింది. దీంతో ఈ షెడ్డు నిరుపయోగంగా మారింది. ఈ షెడ్డు నిర్మాణానికి గతంలో ఓఎన్జీసీ నిధులు మంజూరు చేసిందని, ఆ నిధులు ఏమయ్యాయో! తెలియడం లేదని స్థానిక సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా శ్మశానవాటికకు వెళ్లే మార్గం కూడా సక్రమంగా లేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలి నడకమార్గం కూడా సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. వర్షాకాలంలో ఎవరైనా చనిపోతే వారిని శ్మశానానికి తీసుకువెళ్లడం తీవ్ర ఇబ్బందిగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన శ్మశానవాటిక షెడ్డులో బెడ్ ఏర్పాటు చేయాలని, శ్మశానానికి వెళ్లే మార్గంలో రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా మహాగణపతి స్వామివారి ఊరేగింపు



మోరిలో ఘనంగా మహాగణపతి స్వామివారి ఊరేగింపు

సఖినేటిపల్లి: మండలంలోని మోరిలో ఆదివారం మహాగణపతి స్వామి వారి ఊరేగింపు భక్తులు ఘనంగా నిర్వహించారు. మోరి, మోరిపోడు గ్రామాల్లో స్వామిని ప్రత్యేక వాహనంపై ఆశీనులు చేసి, తీన్‌మార్ బ్యాండు వాయిద్యాలతో, బాణసంచా కాల్పులతో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో వరసిద్ధి వినాయక నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. సోమవారం నూతన ఆలయంలో స్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం వైఖానస ఆగమ పండితుడు పెద్దింటి అనిల్‌కుమార్ ఆచార్యులు నేతృత్వంలో ఆలయ అర్చకుడు వాడపల్లి శ్రీనివాసాచార్యులు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, వాస్తుపూజ, వాస్తుహోమం నిర్వహించారు. దాత పేరాబత్తుల వెంకటరత్నం, లక్ష్మీ పోసికుమారి దంపతులు విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. జాన సునీల్, అద్దాల బాబ్జీ, వలవల రాంబాబు, అద్దాల రాజేశ్వరరావు, జె.మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయం నాయీ బ్రాహ్మణులు చేపట్టిన నిరసనతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దీనిపై తక్షణం స్పందించి సమస్యను పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్ పాలూరి సత్యానందం కోరారు. ఈ సమస్యను ఆదివారం ఆయన దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. సమస్య పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. బీజేపీ నేతలు ఆలయ ఈఓ జి.మాధవిని కలసి సమస్యను తక్షణం పరిష్కరించాలని కోరారు. శ్రావణమాసం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వస్తున్నారని దీన్ని దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకోవాలన్నారు. ఈఓను కలసిన వారిలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ, పార్టీ నేతలు కంకిపాటి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

చినబాలయోగికి సత్కారం

అంబాజీపేట: జిల్లా వైఎస్సార్ సీపీ జనరల్ సెక్రటరీగా నియమితులైన ముక్కామలకు చెందిన దేవరపల్లి చినబాలయోగిని పుల్లేటికుర్రు, ముక్కామల గ్రామ పార్టీ నాయకులు ఆయన స్వగృహం వద్ద ఆదివారం ఘనంగా సత్కరించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలందరి సహకారంతో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని చినబాలయోగి తెలిపారు. సన్మానించిన వారిలో ఎంపీటీసీ వడలి కృష్ణమూర్తి, సొసైటీ అధ్యక్షుడు సందుల ఆదినారాయణ, అందె సూర్యనారాయణమూర్తి, ముత్తాబత్తుల సోమశేఖర్, చిట్టూరి రాధాభాయ్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన రాముకు సన్మానం



సీఐగా పదోన్నతి పొందిన రాము దంపతులను సన్మానిస్తున్న స్నేహితులు

మామిడికుదురు: మొగలికుదురుకు చెందిన సాల లక్ష్మీసోమేశ్వరరావు (రాము) విజయవాడ డివిజన్ సీఐగా పదోన్నతి పొందాడు. పదోన్నతి పొందిన తర్వాత స్వగ్రామం వచ్చిన రాముకు స్థానికులు ఆదివారం ఘనంగా స్వాగతం పలికారు. రాము స్వగృహంలో పండగ వాతావరణం నెలకొంది. రాము రాక సందర్భంగా తాటిపాక, మొగలికుదురు కూడళ్లలో అతని అభిమానులు భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. బంధువులు, స్నేహితులు, అతని శ్రేయోభిలాషులు పూలమాల వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. రాము కృష్ణా జిల్లా నందిగామ ఎస్సైగా పని చేస్తూ పదోన్నతి పొందారు. కార్యక్రమంలో మల్లవరపు మధుబాబు, మట్టా రవి, దొంగ రవిచంద్ర, గంటా ప్రశాంతబాబు, తోలేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు ఆవుకు లేగదూడ జననం



పుంగనూరు ఆవులతో రైతు రామకృష్ణంరాజు

ఆత్రేయపురం: ఎత్తు పెరగవు, చూసేందుకు పొట్టిగా కనిపిస్తాయి. కానీ పాల దిగుబడి, ధర చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే. అవే పుంగనూరు జాతి ఆవులు. ఆత్రేయపురం గ్రామానికి చెందిన వేగేశ్న రామకృష్ణంరాజు ఈ పుంగనూరు జాతి ఆవులను పెంచుతున్నారు. రోజుకు 7 నుంచి 8 లీటర్ల పాలు ఇస్తాయి. ఏటా కాన్పు తప్పనిసరి. సుమారు దీని ధర రూ.8 నుంచి 10 లక్షలు వరకు ఉంటుంది. దీనికి ఓ విశిష్టత ఉంది. సాక్షాత్తూ తిరుమల వేంకటేశ్వరస్వామి పుట్టలో ఉన్నప్పుడు ఈ జాతి ఆవులే స్వామి ఆకలి తీర్చాయని తిరుమల కథ చెబుతుంది. అంతటి విశిష్టత కలిగిన ఈ పుంగనూరు జాతి ఆవులు ఎక్కడ ఉంటే అక్కడ శుభాలు కలుగుతాయని పలువురి నమ్మకం. రైతు రామకృష్ణంరాజు ఆయన అల్లుడు అల్లూరి ప్రసాదరాజు వద్ద నుంచి ఒక ఆవును తెచ్చుకున్నారు. గత నాలుగేళ్లలో నాలుగు దూడలకు జన్మనిచ్చింది. ఇంతకీ వీటి ఎత్తు ఎంత అంటే 2 నుంచి 3 అడుగులే. అంతకి మించి ఎత్తు పెరగవు. కాగా తాజాగా ఈ ఆవు వరుసగా 5వ కాన్పులో మరో లేగ దూడకు జన్మనిచ్చింది.

రెండు మోటారు సైకిళ్ల ఢీ

అల్లవరం: మండలంలోని తుమ్మలపల్లి ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం గుండెపూడికి చెందిన పట్టా ప్రసాద్, కొమరగిరిపట్నానికి చెందిన అల్లవరపు బాలయ్యలు బెండమూర్లంక వైపు బైక్‌లపై వెళుతుండగా ఒకరినొకరు ఢీకొని పడిపోవడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన స్పందించి అమలాపురంలోని ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు.

వెంకన్న ఆలయంలో ఐపీఎస్ అధికారి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఐపీఎస్ అధికారి సుధీర్‌కుమార్ రెడ్డి దంపతులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి దర్శనానంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సంపూర్ణ పారిశుధ్యంతోనే స్వచ్ఛభారత్



గుమ్మిలేరులో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ రాంబాబు

ఆలమూరు: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించినప్పుడు స్వచ్ఛభారత్ సాధ్యమవుతుందని గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు వ్యాఖ్యానించారు. గుమ్మిలేరు, శివారు ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది ప్రత్యేక సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపట్టారు. చెత్త, చెదారాన్ని ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ పనులను సర్పంచ్ రాంబాబు పర్యవేక్షించారు.

రహదారిని అభివృద్ధి చేయండి



అధ్వానంగా ఉన్న తొండవరం వెన్నపువారి పుంత రహదారి

అంబాజీపేట: మారుమూల ప్రాంతంలో గుంతలతో ప్రమాదభరితంగా అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారిని పునర్నిర్మించి అభివృద్ధి చేయాలని తొండవరం శివారు వెన్నపువారిపుంత కాలనీవాసులు కోరుతున్నారు. కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నప్పటికి నేటికి ఈ రహదారి అభివృద్ధికి నోచుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొండవరం జెడ్పీ హైస్కూల్‌కు, ప్రాథమిక పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు, వ్యవసాయోత్పత్తులు తరలించేందుకు ఈ ప్రధాన రహదారిలోనే వెళ్లాల్సి ఉంది. కొద్ది పాటి చినుకులు పడితే రహదారి అంతా బురదమయంగా మారి ప్రమాదాలబారీన పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ ప్రధాన రహదారిని అభివృద్ధి ,చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అయినవిల్లి: మండలంలోని ఎస్.మూలపాలెం ఫీడర్ పరిధిలోని గ్రామాలైన తొత్తరమూడి, కొండుకుదురు, పొట్టిలంక, శానపల్లిలంక గ్రామాల్లోని 33 కేవీ, 11 కేవీ లైన్లకు సోమవారం ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఏఈ వి.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచి పోతుందన్నారు. ఈ సమయంలో మరమ్మతులు నిర్వహిస్తామన్నారు. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.